సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 31 । డిసెంబర్ । 2022


'స్పందన' సమస్యలు పరిష్కరించాల్సిందే IIలో


హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాటం IIలో


కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు IIలో

ప్రగతి ప్రదాతకు నీరాజనం

- జన సంద్రమైన జోగునాథునిపాలెం
- 4.5 కిలోమీటర్ల మేర రోడ్డు పొడవునా పూలతో స్వాగతం
- 'జగనన్నా...మళ్లీ మళ్లీ సీఎంగా నీవే కావాలి' అంటూ నినాదాలు


నర్సీపట్నం సభకు విచ్చేసిన అశేష జనవాహిని (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

సాక్షి, అనకాపల్లి: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాకతో నర్సీపట్నం జన సందోహంతో పులకరించింది. ఎటు చూసినా జన సంద్రం.... జనమే జగన్ అన్నట్టుగా నర్సీపట్నంలో సీఎం పర్యటన సాగింది. సుమారు నాలుగు గంటలపాటు సీఎం పర్యటన జరిగింది. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో గల బలిఘట్టం నుంచి జోగునాథునిపాలెంలోని సభప్రాంగణం వరకు 4.5 కిలోమీటర్ల మేర రోడ్డు మార్గన వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నీరాజనం పలికారు. జననేతకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. నర్సీపట్నం ప్రజలు, చిన్నారులు, మహిళలు రోడ్డు పొడువునా.. పూలతో స్వాగతం పలికారు. వాటితో పాటుగా చిన్నారుల డ్యాన్సు, గిరిజన థింసా నృత్యాలతో, డప్పులతో, మందుగుండు సామగ్రితో సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. 'జై జగనన్నా....మళ్లీ మళ్లీ నీవే సీఎంగా రావాలి..కావాలి' అని నినాదాలు చేశారు.

త్వరలో నర్సీపట్నం రూపురేఖలు మారనున్నాయి...

ఉత్తరాంధ్రలో భాగం అయిన నర్సీపట్నం నియోజకవర్గాన్ని గత పాలకులు పూర్తిగా విస్మరించారనీ.. ఇప్పుడు ప్రజల ప్రభుత్వం చేపడుతున్న భారీ కార్యక్రమాలతో ఈ ప్రాంత రూపురేఖలు మారబోతున్నాయని సీఎం వైఎస్ జగన్ అన్నారు. శంకుస్థాపనల అనంతరం ఆయన మాట్లాడుతూ.. గేట్ వే ఆఫ్ **ఏజెన్సీ రూపురేఖలు మారనున్నాయి...నర్సీపట్నం అంటే ఏజెన్సీ ప్రాంతానికి గేట్‌వే. ఇలాంటి ప్రాంతం గత పాలకుల వల్ల ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడ ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే రెండు గంటలు ప్రయాణం చేసి, విశాఖపట్నం చేరుకుంటే కానీ వైద్యం అందించలేని దుస్థితిలో దశాబ్దాలుగా తల్లడిల్లుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఈ రోజు మనం ఈ ప్రాంతాన్ని, ఈ ప్రాంతం రూపురేఖలను మార్చబోయే కార్యక్రమాలు చేస్తున్నాం. దాదాపుగా** 150 మెడికల్ సీట్లు ఇక్కడ రానున్నాయి. ఇవి వస్తే ఈ ప్రాంతానికి ఎంత మంచి జరుగుతుందో గమనించండి. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. దీనివల్ల చాలా మంది నా చెల్లెమ్మలు మంచి నర్సులుగా చదువుకునే అవకాశం కలుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. నర్సీపట్నం మున్సిపాల్టీలో దాదాపు రూ.16.60 కోట్లతో ఇవాళ ప్రధాన రహదారిని విస్తరించడంతో పాటు మరో రహదారిని అభివృద్ధి చేస్తూ సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ వంటి సమగ్ర కార్యక్రమాలు చేపడుతున్నాం. ఒకవైపు మెడికల్ కాలేజీ, టీచింగ్ హాస్పిటల్, నర్సింగ్ కాలేజీ మరోవైపు పట్టణంలో ప్రధాన రహదారులన్నీ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే నర్సీపట్నం రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయి. తాండవ, ఏలేరు రిజర్వాయరు కాలువల అనుసంధానం కూడా పూర్తయితే... ఇక్కడ ఆయకట్టు స్థిరీకరణ, విస్తరణ కూడా గణనీయంగా పెరిగి ఈ రెండు జిల్లాల్లో రైతుల ముఖంలో చిరునవ్వులు కనిపిస్తాయి. ఇవన్నీ కూడా ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా అడుగుతున్నా.. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. మీ కష్టాలన్నీ నా పాదయాత్రలో నేను చూశాను. వైద్యం కోసం రెండు మూడు గంటలు ప్రయాణించాల్సిన పరిస్థితుల్లో ప్రాణాలు పైకిపోతున్నా కూడా ఏ రోజు గత ప్రభుత్వ పాలకులు పట్టించుకోలేదు. కళ్లెదుటనే తాండవ రిజర్వాయరుకు సంబంధించి .. 51 వేల ఎకరాలు దుస్థితిలో ఉన్నా ఏ ఒక్కరూ ధ్యాస పెట్టలేదు. కేవలం ఈ మూడున్నరేళ్ల కాలంలో మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాత వేగంగా అడుగులు పడుతున్నాయని సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

ముందుగానే సంక్రాంతి పండుగ...

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ...జగనన్న రాకతో తన నియోజకవర్గానికి ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చినట్లు ఉందన్నారు. 2019 ఎన్నికల ప్రచార శంఖారావాన్ని నర్సీపట్నం నుంచే ప్రారంభించారని, అప్పుడు నర్సీపట్నం ప్రజల సమస్యలు ఏవైతే విన్నవించానో.. అవన్నీ మూడున్నరేళ్లలోనే అమలు చేశారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నర్సీపట్నం నియోజకవర్గానికి రూ.1700 కోట్ల నిధులి**చ్చిన ఘనత జగనన్నదేనని కొనియాడారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో గ్రేడ్–3 మున్సిపాలిటీగా ఉన్న నర్సీపట్నంలో, యలమంచిలి కన్నా ఇంటిపన్నులు అధికంగా ఉన్నాయని టీడీపీ ప్రభుత్వంలో అనేకసార్లు ఈ ప్రాంత ప్రజలు విన్నవించుకున్నారని పేర్కొన్నారు. ఇక్కడ గతంలో మంత్రిగా పనిచేసిన తాగుబోతు అయ్యన్న వీటిని పట్టించుకోక** పోవడమే కాకుండా... 2019లో ఎన్నికలకు ముందు టీడీపీ అధికారంలోకి వస్తే 20 శాతం పన్నులు తగ్గిస్తామని మళ్లీ అబద్ధపు హామీలు ఇచ్చాడని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న అయ్యన్న.. ఏమీ పీకలేకపోవడంతో.. గత ఎన్నికల్లో ప్రజలే ఆయన్ని పీకేశారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 25 శాతం ఇంటిపన్నులు తగ్గించిన ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. ఏరియా ఆస్పత్రిని 100 నుంచి 150 పడకలకు పెంచాలని జగనన్నను కోరితే.. ఏకం**గా వైద్య కళాశాలనే** ఇచ్చారని ఆనం**దం వ్యక్తం చేశారు.** నర్సీపట్నం, **పాయకరావుపేట, తుని,** ప్రత్తిపాడు **నియోజకవర్గాల రైతుల** దీర్ఘకాలిక **సాగునీటి సమస్యలను** తీర్చేందుకు **రూ.470 కోట్లతో** ఏలేరు–తాండవ **రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్** నిర్మాణం చేపడుతున్నారని కొనియాడారు. రూ.986.60 కోట్లతో నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు ఈ రోజు శ్రీకారం చుట్టిన సీఎం జగన్ వెంటే తామంతా నడుస్తామని, తన నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఒక ఎమ్మెల్యేగా తలెత్తుకుని వెళ్తున్నట్టు చెప్పారు. 66 గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టగా, తాము ఓటు వేయకున్నా.. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు సంక్షేమ లబ్ధి అందించారని స్వయానా టీడీపీ మహిళలే చెప్పడం గర్వకారణంగా ఉందన్నారు.

రూ.986.60 కోట్లతో అభివృద్ధి పనులు

నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.986.60 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం సీఎం శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.500 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజ్, రూ.470 కోట్లతో ఏలేరు– తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ అనుసంధాన పనులకు శంకుస్థాపన, రూ.16.60 కోట్లతో మున్సిపాలిటీ రోడ్ విస్తరణ పనుల పైలాన్ ప్రారంభించారు. అదేవిధంగా రెండు జిల్లాల్లో గల నర్సీపట్నం, పాయకరావుపేట, తుని నియోజకవర్గాల్లో 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు రూ.470 కోట్లతో నిర్మించ తలపెట్టిన ఏలేరు–తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేసిన సీఎంకు నాలుగు నియోజకవర్గాల ప్రజల నుంచి ప్రత్యేక ధన్యవాదాలంటూ నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, సినీనటుడు ఆర్.నారాయణమూర్తి తెలియజేశారు. కలెక్టర్ రవి పటాన్‌శెట్టి స్వాగతోపన్యాసంతో సభ ప్రారంభమైంది.

సీఎం దృష్టికి సమస్యలు: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: సీఎం జగన్ **మోహన్‌రెడ్డిని** శుక్రవారం **మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలను** నివేదించానని **పాడేరు** ఎమ్మెల్యే **కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి** తెలిపారు. **గిరిజన** విద్యాలయాల్లో **వివిధ** అనారోగ్య **సమస్యలు,**దీర్ఘకాలిక **వ్యాధులతో** గిరిజన **విద్యార్థులు** మరణాలు **చోటుచేసుకుంటున్నా**యని **వివరించినట్టు ఆమె** చెప్పారు. **ఆయా పాఠశాలల్లో** హెల్త్ వలం**టీర్లను నియమించా**లని సీఎం**ను కోరగా సానుకూల**ంగా స్పం**దించారని ఎమ్మెల్యే** తెలిపారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

న్యూస్‌రీల్

నేటి నుంచి ఫుడ్ ఫెస్టివల్

చింతపల్లి: ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రా కశ్మీర్ లంబసింగి రెండు రోజుల పాటు సంప్రదాయ వంటలతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు హరితా హిల్ రిసార్ట్స్' యూనిట్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పర్యాటకుల కోరిక మేరకు వివిధ రకాల శాఖాహార, మాంసాహార వంటకాలు సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ చేస్తున్న పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: స్థానిక డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు శుక్రవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. డివిజన్‌లో ఖాళీగా ఉన్న ఏడు అంగన్‌వాడీ పోస్టులకు ఇటీవల పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 18 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు.

వాహనాల వేలం.. రూ.3.2 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న సీఐ రాంబాబు, ఎస్‌ఐలు

అడ్డతీగల: సారా, మద్యం కేసుల్లో పట్టుబడిన 15 వాహనాలకు వేలం ద్వారా రూ.3.2 లక్షల ఆదాయం వచ్చినట్టు స్థానిక సీఐ వై.రాంబాబు తెలిపారు. రాజవొమ్మంగి, అడ్డతీగల, జెడ్డంగి, మారేడుమిల్లి గంగవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ఆటోలు, రెండు కార్లు, 11 మోటార్‌సైకిళ్లకు బహిరంగ వేలం నిర్వహించినట్టు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 38 ఎస్‌హెచ్‌జీలకు రూ.1.55 కోట్ల బ్యాంకు లింకేజీ
- చెక్కు అందజేత


స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : మహిళ సాధికారతే లక్ష్యంగా ఆర్థికాభివృద్ధి సాధించి జీవన ప్రమాణాలను మెరుగురచుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏలో చింతపల్లి యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో 38 ఎస్‌హెచ్‌జీలకు రూ.1.55కోట్ల చెక్కును కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ అందజేశారు. ఈ బ్యాంకు లింకేజీ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని మహిళలను వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రవితేజ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు భూమికి భూమి

- ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌ఆదిత్య
- వినతుల స్వీకరణ


రైతులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌ఆదిత్య

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు 41 కాంటూరు పరిధిలో డీ–ఫారం పట్టా భూములు కలిగిన గిరిజన రైతులకు భూమికి భూమి అందిస్తామని ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆయన భూ సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2013 చట్టానికి పూర్వం రూ.1.15 లక్షల చొప్పున సేకరించిన భూములకు సీఎం ప్రకటించిన విధంగా చెల్లించిన వాటిని మినహాయించి రూ.5 లక్షల చొప్పున అదనంగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అప్పట్లో మినహాయించిన భూములకు కూడా భూమికి భూమి పరిహారంగా త్వరలో అందజేస్తామన్నారు. ఆర్‌అండ్‌ఆర్, భూ పరిహార సమస్యలు ఏలాంటివి ఉన్నా చింతూరు ఐటీడీఏ పీవోను లేదా తనను నేరుగా సంప్రదించాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- మేలుకొలుపు పుస్తకావిష్కరణ


మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : వినియోగదారులు వారి హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని వాటిని పరిరక్షించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ప్రచురిస్తున్న 'మేలు కొలుపు' డిశంబర్ నెల మాస పత్రికను శుక్రవారం స్థానిక ఐటీడీఏలో ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల్లో చైతన్యం తెచ్చేందుకు ఇటువంటి పత్రికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు సవివరంగా పేర్కొన్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివ ప్రసాద్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పాడేరులో ముగిసిన గిరి విజ్ఞాన సంబరాలు


సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర


ప్రతిభ కనబరిచిన గిరి విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ మాధవి, జేసీ శివశ్రీనివాస్, పీవో గోపాలకృష్ణ, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ

సాక్షి,పాడేరు: గిరిజన విద్యార్థులు బాగా చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల ఆవరణలో గిరి విజ్ఞాన సంబరాల ముగింపు ఉత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లి, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు.గిరిజన విద్యార్థుల నృత్యప్రదర్శనలు, మల్లకంబ విద్య ప్రదర్శనను వీక్షించారు.

ప్రతిభావంతులకు బహుమతులు

విజ్ఞాన సంబరాలు, క్రీడాపోటీలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్, ట్రైకార్ చైర్మన్ తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరి విజ్ఞాన సంబరాలు ఇంత ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన విద్యార్థులు తమలో ప్రతిభను చాటి చెప్పారన్నారు.పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు అన్ని రంగాల్లో సామర్థ్యాలు చాలా అవసరమన్నారు.గిరి విజ్ఞాన సంబరాలు విజయవంతానికి శ్రమించిన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు.

ప్రజాప్రతినిధులు ఏమన్నారంటే..

అరకు ఎంపీ మాధవి మాట్లాడుతూ గిరి విద్యార్థుల్లో ఎంతో మేథాశక్తి దాగి ఉందన్నారు. క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారని అభినందించారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గిరి విజ్ఞాన సంబరాలతో విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొందన్నారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఏటా గిరి విజ్ఞాన సంబరాలను పాడేరు ఐటీడీఏ ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. విజ్ఞాన సంబరాల్లో గిరి విద్యార్థుల ప్రతిభ వెనుక ఉపాధ్యాయుల శ్రమ ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేష్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, నిర్వాహక పాఠశాల హెచ్‌ఎం రీమలి జాన్, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

విజ్ఞానం పంచిన సంబరాలు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో మూడురోజులపాటు నిర్వహించిన గిరి విజ్ఞాన సంబరాలు విద్యార్థుల్లో దాగివున్న విజ్ఞానానికి పదును పెట్టేందుకు దోహదపడ్డాయి. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఇవి శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 122 గిరిజన విద్యాలయాలకు చెందిన 1100 మంది విద్యార్థులు 577 నమూనాలను ప్రదర్శించారు. తెలుగులో 93, ఇంగ్లీషులో 94, గణితంలో107, భౌతిక శాస్త్రంలో 97, జీవశాస్త్రంలో 94 ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. గిరి విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడ్డాయని పలువురు వారిని అభినందించారు. సంబరాలు ముగింపు సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నృత్యాలతో సందడి చేశారు. మహిళా ఉపాధ్యాయులు కూడా థింసా నృత్యాలతో అలరించారు. ఒడిశాలోని లమతాపుట్టు థింసా బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి.


థింసా నృత్యం చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు


హోరెత్తించిన ఒడిశా బ్యాండ్


నమూనాలను ప్రదర్శించిన గిరిజన విద్యార్థులు

కోడిపందాలపై పోలీసుల దాడి


పట్టుకున్న పుంజులు, పందెంరాయుళ్లతో పోలీసులు

కొయ్యూరు : బూదరాళ్ల పంచాయతీ గరిమండ శివారులో కోడిపందాల శిబిరంపై ముందస్తు సమాచారంతో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుంచి నాలుగు కోడిపుంజులను, రూ.310 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు నిర్వహించరాదని గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించామని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు. జూదం, కోడింపదాలు ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చకచకా భూ సర్వే

- రైతుల సమక్షంలోనే ప్రక్రియ
- సర్వత్రా హర్షాతిరేకం


ముంచంగిపుట్టులో సమగ్ర భూ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. సుమారు వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశంలోనే భూములు రీసర్వేకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పేరిట అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమక్షంలో సర్వేను చేపడుతున్నారు. డ్రోన్లతో, మ్యాపులతో సర్వే నిర్వహించి రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా అరకు నియోజకవర్గంలోని అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలోని 71 గ్రామాల్లో 11,245 ఎకరాల్లో నేటి వరకు రెవెన్యూ అధికారులు సర్వే జరిపారు. సర్వే నంబర్లు ఆధారంగా పల్లం, మెట్ట భూములు, పోరంబోకు, ప్రభుత్వ భూములను గుర్తించారు. ముంచంగిపుట్టు మండలంలో 24 గ్రామాల్లో 3,091 ఎకరాల్లో సర్వే జరిగింది. పెదబయలులో 13 గ్రామాల్లో 2500 ఎకరాల్లో, హుకుంపేటలో 10 గ్రామాల్లో 1,300 ఎకరాల్లో, అరకులో 6గ్రామాల్లో 1,300 ఎకరాల్లో, డుంబ్రిగూడలో 13 గ్రామాల్లో 1,200 ఎకరాల్లో, అనంతగిరిలో 19 గ్రామాల్లో 2,000 ఎకరాల్లో నేటి వరకు సమగ్ర భూ రీ సర్వే జరిగింది.

ఖచ్చితమైన కొలతలు

సమగ్ర భూ సర్వేతో రెవెన్యూ గ్రామాల్లో హద్దులను నిర్ణయించి, డ్రోన్‌తో గుర్తించి సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తారు. పంచాయతీ అధికారుల సహాయంతో నివాస గృహాలను గుర్తిస్తారు. అన్నిరకాల భూములను గుర్తించేందుకు గాను ప్రతి హద్దుకు జీఎన్ఎస్ఎస్ రోవర్, ఈటీఎస్ వంటి ఆధునిక యంత్రాల సహాయంతో అక్షాంశ, రేఖాంశాలతో కూడిన జియో కోడ్స్ డేటాను, భూముల ఛాయా చిత్రలను సేకరిస్తారు. ఈ డేటా ఆధారంగా సర్వే ఆఫ్ ఇండియా ప్రతీ గ్రామానికి ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజ్(ఓఆర్‌ఐ)ఛాయా చిత్రాలను అందించి ఖచ్చితమైన భూములను నిర్ధారిస్తుంది. భూ కొలతలపై ఏమైనా అభ్యంతరాలుంటే తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే.. 30 రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర రీసర్వే వల్ల భూ సమస్యలు తీరుతుండడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



సమగ్ర భూ సర్వే వల్ల రైతులకు ఎంతగానో మేలు చేస్తోంది. రైతుల పొలాల విస్తీర్ణం పక్కాగా తెలుస్తుంది. దీంతో పాటు వందేళ్ల నాటి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరగడంతో పాటు పూర్తి వివరాలతో నూతన రికార్డులు తయారవుతాయి. తద్వారా రైతుల మధ్య భూ సమస్యలు తగ్గుతాయి. రైతులకు అవగాహన కల్పిస్తూ వారి సమక్షంలోనే భూ రీ సర్వేను నిర్వహిస్తున్నాం.

– నర్సమ్మ, తహసీల్దార్, ముంచంగిపుట్టు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సమగ్ర భూ రీసర్వే వల్ల ఎంతో ఉపయోగం ఉంది. రీసర్వే చేయడం వల్ల నా భూమి విస్తీర్ణం ఖచ్చితంగా తెలిసింది. గతంలో పలుమార్లు భూమి సర్వే కోసం ప్రయత్నం చేసిన జరగలేదు. ఇప్పుడు అన్ని రకాలుగా అధికారులు గ్రామానికి వచ్చి అవగాహన కల్పిస్తూ సర్వే చేస్తున్నారు. మా గ్రామంలో సర్వే వల్ల భూ సమస్యలు కూడా పరిష్కారమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం.

– పి.సద్దన్న, రైతు, లుంగాపుట్టు గ్రామం, వనభసింగి పంచాయతీ

గంజాయి స్వాధీనం: ముగ్గురు అరెస్టు


గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ షరీఫ్, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ మీదుగా మోటారు బైక్‌పై శుక్రవారం గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ షరీఫ్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లిలో పది కిలోల గంజాయిని కొనుగోలు చేసి కృష్ణా జిల్లా వైపు వెళ్తుండగా జడ్డంగి పోలీసుస్టేషన్ పరిధిలో తనిఖీల్లో పట్టుబడినట్టు చెప్పారు. వారి నుంచి మోటార్‌బైక్, రూ.2200, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిలో ఇద్దరు కృష్ణా జిల్లా ముువ్వ మండలం అయ్యం గ్రామం, పడిమిముక్కల మండలం పెనుమత్స గ్రామం కాగా, ఇంకొకరు చింతపల్లి మండలం అన్నవరం ప్రాంతాలకు చెందినట్టు తెలిపారు. వీఆర్వో నానాజీ, పోలీసు సిబ్బంది దుర్గారావు, లీలాకృష్ణ, శివరామకృష్ణ ఉన్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: మన్యంలో పొగమంచు దట్టంగా కురుస్తోంది.కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు కొనసాగుతోంది. పాడేరు మండలం మినుములూరులో 13 డిగ్రీలు, చింతపల్లిలో 13.3 డిగ్రీలు, అరకులోయలో 15.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల వరకు పొగమంచు తీవ్రత నెలకొంది.

‘స్పందన’ సమస్యలు పరిష్కరించాల్సిందే

- లేకుంటే చర్యలు
- అన్ని శాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక
- ఒకటి నుంచి ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు
- 46 అర్జీల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తోందని, అందుకు తగ్గట్టుగా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టని అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని, రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి సమస్యలు, కొత్త రేషన్‌కార్డులు,పింఛన్లు మంజూరు వంటి సమస్యలను పరిష్కరించాలని గిరిజనులకు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.ఆయా సమస్యలు పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. పలు గ్రామాలకు చెందిన గిరిజనుల నుంచి 46 వినతులను స్వీకరించారు.

అర్జీ పరిష్కారంపై వెంటనే దృష్టి

స్పందనలో అర్జీ అందిన వెంటనే సమస్య పరిష్కారానికి విచారణ అధికారిని నియమించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్పందనకు వచ్చిన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్జీపై బాధితుడితో కూడా మాట్లాడాలని సమస్య పరిష్కారమైన వెంటనే ఫొటో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. ఏ కారణం లేకుండా స్పందన అర్జీలను తిరస్కరించవద్దని, ఒక వేళ తిరస్కరణకు గురైతే కారణాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేయాలని ఆదేశించారు. కొంతమంది అధికారులు స్పందన అర్జీలను చూడడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ అధికారి లాగిన్ అయిన స్పందన అర్జీలను పరిశీలించి, పరిష్కరించాలని శుక్రవారం హాజరై వెళ్లిపోవడం కాదన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పందన అర్జీల పరిష్కారంపై సమీక్షిస్తున్నారని, ఇందుకు ప్రతీ అధికారి జవాబుదారుగా ఉండాలని ఆయన సూచించారు. ఈ వారంలో అందిన స్పందన దరఖాస్తులపై జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టి, సంబంధిత అధికారులు ఆయా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెల ఒకటి నుంచి అధికారులు అంతా ఫేషియల్ యాప్ ద్వారా హాజరు నమోదుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రంపచోడవరం, చింతూరు పర్యటన తప్పనిసరి

జనవరి నుంచి ప్రతి జిల్లా అధికారి రెండు రోజులు రంపచోడవరం, ఒకరోజు చింతూరు డివిజన్‌లో పర్యటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌సూచించారు. పర్యటనలో భాగంగా సంబంధిత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులను కలవాలని, మండల స్థాయి కార్యాలయాలను సందర్శించాలని సూచించారు. ఆయా అధికారులతో సమావేశాలు నిర్వహించి, తగిన సలహాలు,సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి.అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

‘లైఫ్ సర్టిఫికెట్’ గడువు ఫిబ్రవరి 28

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు ఏటా సమర్పించవలసిన లైఫ్ సర్టిఫికేట్‌ను జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ పద్ధతిలో జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు మాత్రమే సమర్పించుకోవచ్చని జిల్లా ఖజానా, లెక్కల అధికారి వి.యల్. సుబాషిణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పింఛన్‌దారులు తమ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, పింఛన్ పుస్తకంతోపాటు ఓటీపీ కోసం మొబైల్‌ను తీసుకుని దగ్గర్లోని ట్రెజరీ కార్యాలయం, పింఛన్ సేవాకేంద్రం, మీసేవ, ఇంటర్నెట్ కేంద్రం ద్వారా సమర్పించవచ్చన్నారు. బయోమెట్రిక్ వేలిముద్ర సమస్య ఉన్నవారు నేరుగా ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల పంట

యలమంచిలి క్రీడాకారులకు అభినందన


బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

యలమంచిలి: రాష్ట్ర స్థాయి అండర్ -19 తైక్వాండో పోటీల్లో యలమంచిలి క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ నెల 28న వైఎస్సార్ కడప జిల్లా కోడూరులో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎల్. లహరి, రొట్ట పల్లవి, ఉండ జయశ్రీ బంగారు పతకాలు సాధించారు. టి.శ్వేత రజతం, ఉండా మౌనిక కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కోచ్ నగిరెడ్డి సత్యనారాయణతో పాటు విజేతలను ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, బొద్దపు యర్రయ్యదొర, కస్పా రవికుమార్ తదితరులు శుక్రవారం అభినందించారు.

హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాటం


సభకు హాజరైన ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

- దశలవారీగా ఉద్యమాలు
- గర్జన సభలో ఆదివాసీ జేఏసీ ప్రతినిధుల స్పష్టీకరణ
- జీవో నెం.52ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్

పాడేరు రూరల్: గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని, ఇందుకు దశలవారీగా ఉద్యమాలు చేస్తామని ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గిరిజన ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎం. శేషాద్రి అధ్యక్షతన శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివాసీ గర్జన సభ నిర్వహించారు. అభివృద్ధి చెందిన ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు విడుదల చేసిన జీవో నెం.52ను తక్షణమే రద్దు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని, జీవో నెం.3ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర స్థాయి నేతలు మాట్లాడారు. ఆదివాసీలకు శత శాతం ఉద్యోగాలు కలిప్పించేలా షెడ్యూల్ ప్రాంతాల ఉద్యోగ నియామకం చట్టం చేయాలని కోరారు.

జీవో నెం.3పై రాష్ట్ర ప్రభుత్వ తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో బినామీ ఆస్తుల నిరోధక చట్టం చేయాలని, నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు పొందిన గిరిజనులపై కఠిన చర్యలు తీసుకుని ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఎర్రవరం వద్ద నిర్మిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గిరిజన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్టీఈఏ జాతీయ అధ్యక్షుడు పి.వి.రమణ, జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ, జిల్లా కన్వీనర్ రామరావుదొర, ఏఏఏఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాడవి నెహ్రూ, ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వి. కాంతమ్మ, గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి. సింహాచలం, జేఏసీ రాష్ట్ర సలహాదారు సొనాయి గంగరాజు, రాష్ట్ర కోశాధికారి నాగభూషణరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కిల్లో గంగన్నపడాల్, ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యా సంఘాల ప్రతినిధులు, అదిక సంఖ్యలో ఆదివాసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో రాజవొమ్మంగి వాసి మృతి


సూరిబాబు(ఫైల్)

రాజవొమ్మంగి : పలు ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ మండలవాసుల అందరికి సుపరిచితులు, స్నేహశీలి మంకు సూరిఅప్పారావు (సూరిబాబు) (45) శుక్రవారం సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించారు. మండలంలోని సూరంపాలెం గ్రామ అల్లుడు అయిన ఈయన దాదాపు అర్ధ దశాబ్దాంగా రాజవొమ్మంగిలో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక షిరిడీసాయిబాబా వారి ఆలయం, గ్రామదేవత నూకాలమ్మ తదితర ఆలయాలకు ఆయన విరివిగా విరాళాలు ఇచ్చి ఆలయాల అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సూరంపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అడిగర్ల గజ్జియ అల్లుడైన సూరిబాబు సింగపూర్‌లో ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఆయన మరణించారన్న వార్తతో రాజవొమ్మంగి పరిసర గ్రామాల్లో విషాదం అలముకొంది. సూరిబాబుకు భార్య, పదేళ్ళ వయస్సుగల కుమారుడు వున్నారు.

ఏరియా ఆస్పత్రిలో ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీ

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రిని వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు శుక్రవారం సందర్శించారు. సీఎం పర్యటన నేపథ్యంలో నర్సీపట్నం విచ్చేసిన ఆయన ఇక్కడ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ప్రధానంగా ప్రసూతీ సేవలపై ఆరా తీశారు. నెలకు 400 వరకు ప్రసవాలు చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవి వివరించారు.